ప్రజాశక్తి
సోమవారం 29 జులై 2024
5
విజయనగరం

## చీర్ ఫర్ భారత్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఇండియా క్రీడాకారులకు కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఒలింపిక్ క్రీడాకారులకు మద్దతుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తీసుకొచ్చిన చీర్ ఫర్ భారత్ సెల్ఫీపాయింట్‌ను ఆదివారం స్థానిక అశోక్ బంగ్లా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో భారత్ క్రీడాకారులు ఎక్కువ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు మద్దతు తెలియజేస్తున్న అశోక్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సహారా బాధితులు, ఏజెంట్లు, పోరాట కమిటీ నాయకులు (ఫైల్)

**పిల్లల చదువుల కోసం ఒకరు.. అమ్మాయి వివాహం కోసం మరొకరు.. వృద్ధాప్యంలో చేయూత కోసం ఇంకొకరు.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో ఆశ. ఒక్కో ఆలోచన. డబ్బులు పొదుపు చేసుకుంటే భవిష్యత్తులో ఉపయోగ పడతాయనేది సామాన్య, మధ్యతరగతి ప్రజలందరి అభిలాష. అలాంటి వారికి లాభాలను ఆశ చూపించి, పేద ప్రజల నుంచి కోట్లాది రూపాయలు డిపాజిట్ల రూపంలో వసూలు చేసింది సహారా ఇండియా సంస్థ. కష్టపడి ఒక్కో రూపాయి పోగుచేసుకుని, దాచుకున్న ప్రజల డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసగించింది. అగ్రిగోల్డ్ కన్నా పెద్ద ఎత్తున ప్రజలను వంచించింది. ఇచ్చిన బాండ్లు సమయం ముగిసిన తర్వాత కూడా డబ్బులు ఇవ్వకుండా రెన్యువల్ చేస్తూ సిఆర్‌పి పోర్టల్ ద్వారా దగా చేస్తూ వస్తోంది. దీంతో సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ పోరాటానికి శ్రీకారం చుట్టింది.**

# 'సహారా' బాధితుల పోరుబాట

- జిల్లాలో లక్షకు పైగా బాధితులు
- రావాల్సింది రూ.600 కోట్లకు పైనే..
- నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలకు పోరాట కమిటీ పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో లక్షకు పైగా సహారా ఇండియా బాధితులు ఉన్నారు. జిల్లాలో ఖాతాదారులకు రూ.600 కోట్లకు పైగా సహారా ఇండియా నుంచి రావల్సి ఉంది. వారికి 2012 నుంచి పూర్తిగా పేమెంట్లు ఇవ్వడం ఆగిపోయాయి. ప్రారంభంలో రూ.16 వేలు కడితే ఆరేళ్లకు రెట్టింపు, 15 ఏళ్లకు రూ.1.08 లక్షలు చెల్లిస్తామంటూ ప్రకటించారు. ఇటువంటి ఎన్నో స్కీముల ద్వారా జిల్లాలో భారీగా డిపాజిట్లు సేకరించారు. ఖాతాదారులకు పేమెంట్ ఇచ్చే పరిస్థితిలో లేరని తెలిసి గత యుపిఎ ప్రభుత్వం సెబికి అప్పగించింది. సెబి సుప్రీంకోర్టులో కేసు వేయడంతో 2012 ఆగస్టు 31న ఖాతాదారులకు 15 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. కానీ రాత్రి రాత్రికే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి రియల్ ఎస్టేట్, హౌసింగ్ బాండ్లు, క్యూ షాప్ అనే కొత్త పాలసీ తీసుకొచ్చి బాండ్లన్నీ మార్చేశారు. ఖాతాదారులకు, ఏజెంట్లకు తెలియకుండా ఈ తతంగాన్ని పూర్తిచేశారు. ఖాతాదారులకు ఫోన్లు చేసి వారి దగ్గర ఉన్న ఒరిజినల్ బాండ్లు సేకరించారు. ఖాతాదారులంతా క్యూ షాప్ పాలసీల కిందకు వచ్చేశారు. దీనిపై మళ్లీ సెబి సుప్రీంకోర్టుకు వెళ్లింది. కానీ సహారా ఇండియా యాజమాన్యం డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చింది. 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సహారా యాజమాన్యాన్ని కాపాడుతూ వస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఖాతాదారులకు 2012 నుంచి నేటి వరకు సహారా ఇండియా సంస్థ పేమెంట్లు చెల్లించడం మానేసింది. 12 ఏళ్లలో నాలుగు రకాల సొసైటీలు పెట్టి ,డబ్బులను మారుస్తూ వస్తున్నారు తప్ప డబ్బులు మాత్రం ఖాతాదారులకు ఇవ్వడం లేదు. సీనియర్ ఏజెంట్లు అడిగితే వారిని బెదిరించడం వంటి చర్యలకు సహారా యాజమాన్యం దిగినట్లు తెలిసింది. దీనిపై దేశ వ్యాప్తంగా యాజమాన్యంపై పోరాటం ప్రారంభమైంది.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా..**

సెబిలో ఉన్న రూ.24 వేల కోట్లలో రూ.5 వేల కోట్లు అత్యవసర ఖాతాదారులకు ఇవ్వాలని సుప్రీంకోర్టు గతేడాది మార్చి 29న ఆదేశించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రిజిస్ట్రేషన్ కోఆపరేటివ్ సొసైటీకి బాధ్యత అప్పగించింది. జడ్జి, లాయర్ సమక్షంలో ఖాతాదారులకు ఆ పేమెంట్లు చేయాలని చెప్పింది. గతేడాది జులైలో సహారా పోర్టల్‌ను ప్రారంభించి, ఖాతాదారులకు ముందు రూ.10 వేలు చెల్లించి, తర్వాత అంచలంచెలుగా ఇస్తామని ప్రకటించారు. డబ్బుల కోసం ఖాతాదారులు ఆన్‌లైన్ చేస్తే, అన్ని తిరస్కరణకు గురయ్యాయి. ఏడాది గడిచినా జిల్లాలో ఏ ఒక్కరికీ డబ్బులు అందిన ఘటనలు కనిపించలేదు. సహారా ఇచ్చిన ప్రతి బాండ్‌పై అకౌంట్, మెంబర్‌షిప్, రశీదు, బాండ్ నంబర్లు ప్రింటింగ్ ద్వారా వస్తాయి. ఈ నాలుగు నెంబర్లు ఉన్నా ఏదో ఒక కారణంతో రిజెక్ట్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

**నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు**

ఏడాదిగా జిల్లాలో ఖాతాదారులకు ఎవరికీ సహారా ఇండియా సంస్థ నుంచి డబ్బులు చెల్లించిన దాఖలాలు లేవు. దీంతో జిల్లాలో ఉన్న ఖాతాదారులు, ఏజెంట్లు రోడ్డెక్కి, వారికి రావాల్సిన డబ్బుల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అందులో భాగంగా సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ ఏర్పాటైంది. ఇప్పటికే సిఐటియు, పోరాట కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ పోరాట కమిటీ ఆధ్వర్యాన సోమవారం జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నారు. సహారా బాధితులకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ఏక మొత్తంలో డబ్బులు చెల్లించాలన్న డిమాండ్‌తో ధర్నాలు నిర్వహిస్తున్నారు.

### న్యాయం జరిగే వరకూ పోరాటం

సహారా ఖాతాదారులకు, ఏజెంట్లకు న్యాయం జరిగే వరకూ పోరాటం సాగుతుంది. ప్రజలను నమ్మించి మోసం చేసిన యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకొని ఖాతాదారులకు రావాల్సిన డబ్బులు చెల్లించాలి. సహారా యాజమాన్యానికి కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలకకుండా ఖాతాదారులకు న్యాయం చేయాలి.

- బి.లక్ష్మీదాస్,
సహారా ఇండియా బాధితులు పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు

### ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కేంద్ర ప్రభుత్వం సహారా బాధితులకు న్యాయం చేసేందుకు బాధ్యత వహించాలి. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలను మోసం చేసిన సంస్థలపై చర్యలు తీసుకోకుండా, వారిని కాపాడే ప్రయత్నం చేయడం సరికాదు. సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సహారా బాధితులను ఆదుకోవాలి. సహారా ఖాతాదారులకు, ఏజెంట్లకు అండగా ఉంటాం. న్యాయం జరిగే వరకూ పోరాడుతాం.

- తమ్మినేని సూర్యనారాయణ,
సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ జిల్లా గౌరవ సలహాదారులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న జెవివి, ప్రజా సంఘాల నాయకులు

# మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలి

## జెవివి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

దేశంలో రోజురోజుకు మూఢనమ్మకాలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని, ఫలితంగా అమాయక ప్రజలు అన్యాయంగా ధన, మాన ప్రాణాలను కోల్పోతున్నారని జనవిజ్ఞాన వేదిక సమతా మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. దీనికి విరుగుడు ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావడమేనని తీర్మానించింది. ఆదివారం స్థానిక పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ భవనంలో 'బోలేబాబా (హత్రాస్) దుర్ఘటన - మహిళల దుర్మరణం - కారణాలు - కర్తవ్యాలు' అనే అంశంపై సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న నేటి ఆధునిక సమాజంలో ఆదిమ కాలం నాటి అనాగరిక పద్ధతులకు జనం వెంపర్లాడటం, వాటి పట్ల పాలకులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటం ఆందోళకరమని అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ సమాజ ఏర్పాటు దిశలో మహిళలు ముఖ్య భూమిక వహించాలన్నారు. బోలె బాబా ఆశ్రమంలో జరిగిన సంఘటనను ఖండిస్తూ జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులంతా బలపరిచారు.

ఆగస్టు 4న నగరంలోని ఎన్‌జిఒ హోంలో జరిగే సమతా మహిళా కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని, మహిళల్లో శాస్త్రీయ భావాలను పెంచే దిశగా పని చేయాలని జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజగోపాల్ కోరారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, సమీరా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పోస్టల్ ఉద్యోగ సంఘ నాయకులు కె.నారాయణరావు, అంగన్వాడీ సంఘం నాయకులు ఎస్.అనసూయ, ఐద్వా నాయకులు కరుణ, జెవివి నగర అధ్యక్షులు చిన్నారి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 480 మెట్రిక్ టన్నుల డిఎపి రాక

- 38 రైతు సేవా కేంద్రాలకు పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు

**విజయనగరంకోట :** జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైతులకు పంపిణీ చేసేందుకు 480 మెట్రిక్ టన్నుల డిఎపి ఎరువులతో కూడిన గూడ్సు వ్యాగన్ జిల్లాకు చేరుకున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు తెలిపారు. ఇప్పటికే ప్రతిపాదన పంపిన జిల్లాలోని 38 రైతుసేవా కేంద్రాలకు ఈ ఎరువులను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు మార్క్‌ఫెడ్ మేనేజర్ విమలను ఆదేశించినట్లు తెలిపారు. నగరంలోని గూడ్సుషెడ్‌కు వచ్చిన డిఎపి రేక్‌ను ఆయన.. మార్క్‌ఫెడ్ మేనేజర్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. రైలు వ్యాగన్ నుంచి లారీల ద్వారా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతుసేవా కేంద్రాలకు డిఎపి, యూరియా పంపించినట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో గానీ, ప్రైవేటు డీలర్ల వద్ద గానీ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే వెంటనే సంబంధిత రైతులు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణం, ఎఒ ఉమామహేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల తరలింపును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు

### ప్రత్యేక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

**విజయనగరం కోట :** విజయనగరంలోని గురజాడ గ్రంథాలయంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ కృష్ణాజి.. ఆదివారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతి అందించారు. గురజాడ గ్రంథాలయంలో ఉత్తరాంధ్రలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుంటారని తెలిపారు. గ్రంథాలయ సమీపంలో అద్దె గదుల్లో ఉంటూ, తల్లిదండ్రులు పంపించిన చాలీచాలని డబ్బులతో కాలం గడుపుతున్నారని తెలిపారు. వీరి కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్న క్యాంటీన్ ఏర్పాటుచేస్తే ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఎరుకొండ ఆనంద్, నగర అధ్యక్షులు షిణగం శివాజీ, ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, జిల్లా మాజీ అధ్యక్షులు రాజగోపాల్ పాల్గొన్నారు.

# రాజకీయ రంగు పులుముతున్న బొత్స

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

దన్నానపేట ఘటనకు మాజీమంత్రి బొత్స సత్యనారాయణ రాజకీయ రంగు పులమడం సిగ్గుచేటని చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. మాజీ సైనికుడు పతివాడ వెంకునాయుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించారంటూ స్థానిక అశోక్ బంగ్లాలో ఆదివారం దన్నానపేట గ్రామస్తులు మంత్రికి వినతి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాజీ సైనికుడు పతివాడ వెంకునాయుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కట్టిన ప్రహరీని అధికారులు కూల్చితే, ఏకంగా ఇంటినే కూల్చారంటూ మాజీ మంత్రి బొత్స అనడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామస్తులు నడిచే తోవను ఆక్రమించి, దౌర్జన్యంగా ప్రహరీ గోడను నిర్మించినందుకు గత వైసిపి ప్రభుత్వ అధికారంలో ఉన్న 2022లో ఫిర్యాదు అందిందన్నారు. దీనికి తమ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టంచేశారు. గతంలో గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకున్నారు తప్ప ఆయన ఇంటిని ఎక్కడా ముట్టుకోలేదని తెలిపారు. అదే గ్రామంలో గ్రామ సర్పంచ్ సిసి రోడ్డు ఆక్రమిస్తూ కట్టిన ఇల్లు వైసిపి నాయకులకు కనబడలేదా? అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలకు స్థల సేకరణలో భాగంగా దళితులు ఏళ్ల తరబడి నివాసముంటున్న స్థలాన్ని దౌర్జన్యంగా 150 మంది పోలీసులను పెట్టి ఖాళీ చేయించినప్పుడు వారి బతుకులు ఏమవుతాయో గత వైసిపి ప్రభుత్వానికి పట్టలేదా? అని నిలదీశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, దన్నానపేట మాజీ ఎంపిటిసి ఆర్.గోవిందరావు, రేగాన రాజారావు ,పిల్లా చిన్ననాయుడు చందక రామరాజు, పిన్నింటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా నియంత్రణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

### ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో గంజాయి రవాణా నియంత్రణకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేశామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఇందులో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే అన్ని రహదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టాలని ఎస్‌పి పోలీసు అధికారులను ఆదేశించారు. వాహన తనిఖీలను ఒకే ప్రాంతంలో కాకుండా రోజూ వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని సూచించారు. వాహనాల రికార్డులను పరిశీలించాలని, నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఇ-చలానాలు విధించాలని ఆదేశించారు.

ఎవరి వద్ద నుంచి పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారన్న విషయాలను రాబట్టేందుకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని నియమించామని చెప్పారు. ఈ బృందాలు జిల్లాలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, గంజాయి సేవించి, అల్లర్లకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొంటాయని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి గురించి సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ సిఐ ఫోను నంబరుకు 9121109416కు అందించాలని ఎస్‌పి ప్రజలను కోరారు.

### బీచ్ కబడ్డీ జట్లు ఎంపిక

**విజయనగరం టౌన్ :** ఆగస్టు 2 నుండి 4 వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. సారిపల్లిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు జట్టుకు ఆరుగురు, మహిళల జట్టుకు ఆరుగురు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కెవి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ ఎన్.సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

### కబేళాను సీజ్ చేయాలని ధర్నా

**విజయనగరం టౌన్ :** నగరంలో స్వర్గధామం వద్దనున్న అక్రమ కబేళాను సీజ్ చేయాలని కోరుతూ ఎపి గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షులు లోగి రామకృష్ణ ఆధ్వర్యాన ఆదివారం ఆ కబేలా వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు కెవిఆర్ సత్యనారాయణ, మద్దిల సోంబాబు, నీలాపు దేవి, తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహారాజపేటలోని గిరిజన మహిళా హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆదివారం విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ హాస్టల్లో సమస్యలు పెరిగిపోయాయని తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరిందని, దీనికి ప్రత్యామ్నాయ భవనం ఉన్నా మార్చలేదంటే వార్డెన్ నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని విమర్శించారు. అనధికారికంగా 50 మంది వరకు ఉంటున్నారని, వారికి ఎలా వార్డెన్ వసతులు కల్పిస్తున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న గిరిజన సంక్షేమ అధికారి రామానందం విద్యార్థులతో సమావేశమై, సమస్యలు తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు చెప్పిన సమస్యలు తక్షణమే వార్డెన్ పరిష్కరించాలని, లేకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్ , వి.చిన్నబాబు, నగర అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రమేష్ , నాయకులు సుస్మిత, దుర్గాప్రసాద్, రామకృష్ణ, ఆద్య తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పాం సాగుతో నిరంతర ఆదాయం

- ఉద్యాన పంటల్లో ఎంతో లాభసాటిది
- ప్రభుత్వం తరపున ఆకర్షణీయ ప్రోత్సాహం
- సాగు పెంపునకు స్పెషల్ డ్రైవ్
- 'ప్రజాశక్తి'తో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎవిఎస్‌వి జమదగ్ని

**ఆయిల్‌పాం సాగుతో రైతులకు నిరంతరంగా ఆదాయం సమకూరుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎవిఎస్‌వి జమదగ్ని అన్నారు. ఉద్యాన పంటల్లో ఎంతో లాభసాటిదని వివరించారు. ఈ పంటలు సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం తరపున ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పాం సాగు పెంపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...**

**- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి**

**జిల్లాలో ఆయిల్ ఫామ్ విస్తీర్ణం ఎంత.?**

జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది. ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది అదనంగా కనీసం 2,500 ఎకరాల మేర విస్తీర్ణం పెంచేందుకు కృషిచేస్తున్నాం. అందుకు తగ్గట్టు ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగుతున్నాం.

**ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలేమిటి.?**

జిల్లాలో ఆయిల్‌పాం కంపెనీలు ఉన్నాయి. ఇవన్నీ 100శాతం సబ్సిడీతో మొక్కలు సరఫరా చేస్తాయి. ప్రస్తుతం ఒక్కో మొక్క ఖరీదు రూ.193 వరకు ఉంది. ఎకరా విస్తీర్ణంలో 57 మొక్కలు నాటుకోవచ్చు. మొక్కలకు సంబంధించిన మొత్తం సొమ్మును కంపెనీలకు ప్రభుత్వమే నేరుగా డిబిటి పద్ధతిలో చెల్లిస్తుంది. సాగు సబ్సిడీ కింద 2.5 ఎకరాలకు రూ.5250, అంతర పంటల సాగుకు మరో రూ.5,250 చొప్పున చెల్లిస్తారు.

**మొదటి ఫలం అందేసరికి ఎన్నేళ్లు పడుతుంది.?**

నాలుగేళ్లు పూర్తయ్యే నాటికి తొలి పంట చేతికి అందుతుంది. ఏడేళ్లు పూర్తయ్యే నాటికి నికరమైన ఎంట చేతికొస్తుంది. ఇలా 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ప్రతి 15 రోజులకోసారి క్రాప్ కటింగ్ చేసుకోవచ్చు. ఆ తరువాత కూడా దిగుబడి తగ్గిన చెట్లను క్రమంగా తొలగించి, వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటుకోవచ్చు. దీనికి కూడా ప్రభుత్వం తరపున రాయితీలు ఉన్నాయి. అదే కాలవ్యవధిలో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి కంపెనీలు డబ్బులు జమచేస్తాయి. అందువల్ల ఈ పంట నిరంతర ఆదాయం అందిస్తుందని భావించవచ్చు.

**యాజమాన్య పద్ధతులు, పెట్టుబడులు ఎలా ఉంటాయి.?**

సాధారణంగా ఆయిల్‌పాం సాగుకు మెట్ట ప్రాంతం అనువుగా ఉంటుంది. అయితే, నిరంతరం నీటి సదుపాయం ఉండాలి. ఎరువులు కూడా అవసరమౌతాయి. బోర్లు, లేదా బావుల తప్పక ఉండాలి. నీటిని పరువుపులా పెట్టకుండా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెడితే సరిపోతుంది. చీడపీడల నివారణ చూసుకుంటే చాలు. ఇంతకు మించి ఇంకేమీ అవసరాలు ఉండవు. ఈ పెట్టుబడులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు దాదాపు సరిపోవచ్చు. ఎపిఎంఐపి ద్వారా రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్‌కు అవసరమైన పైపులు, స్పింకర్లు తదితరాలు పొందవచ్చు.

**ధర నిర్ధారణ, మార్కెట్ సదుపాయం ఎలా.?**

సాధారణంగా ఆయిల్‌పాం ధర ఎప్పటికప్పుడు మారుతుంది. ఈ ధరలను కూడా ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. మొక్కలు సమకూర్చిన కంపెనీలే నేరుగా ఉత్పత్తిని కొనుగోలు చేస్తాయి కాబట్టి రైతులు మార్కెట్ సదుపాయం కోసం పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. నాలుగో ఏట తొలిసారి పంట చేతికందే సమయంలో ఎకరా విస్తీర్ణంలో 2 నుంచి 3 టన్నుల ఉత్పత్తి వస్తుంది. ఏడేళ్ల నాటికి క్రమంగా 10 నుంచి 15 టన్నుల వరకు ఉత్పత్తి ఆశించవచ్చు. ప్రస్తుతం టన్ను రూ.13,280 చొప్పున ధర పలుకుతోంది.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దంపతులు

## రామచంద్రపేటలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రామచంద్ర పేట గ్రామంలో ఎమ్మెల్యే లోకం మాధవి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారి సమస్యను మరోసారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. క్వారీ గ్రామం పక్కన ఉన్నందున బ్లాస్టింగ్ నిర్వహిస్తే ఇబ్బందికరమైన పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు వివరించారు. మరోచోట ఎక్కడైనా అనుమతులు ఇవ్వాలని కోరారు. విమానాశ్రయం నిర్మాణాన్ని ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అయినా మరోసారి అధికారులతో మాట్లాడతానని చెప్పారు. పేలుళ్లకు ఇంటి స్లాబు పెచ్చులు రాలడాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను, అంగన్వాడి నిర్మాణాన్ని పరిశీలించారు. జనసేన నాయకులు లోకం ప్రసాద్, గ్రామస్తులు దుక్క అప్పన్న, రవణ, కోలా రామ సూరి, పోలిరెడ్డి, గొంప నరసింహ, గురువులు తదితరులు పాల్గొన్నారు.

## కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్డ్ కార్మికులకు కనీస ఫించన్ రూ.9వేలు ఇవ్వాలని రిటైర్డ్ వర్కర్స్ అసోషియేషన్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పలసూరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్మిక సంఘం భవనంలో వారు విలేకర్లతో మాట్లాడారు. మోడి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు దోచి పెడుతూ లక్షలాది మంది కార్మికులకు 1000, 1500రూపాయలు ఫించన్ ఇవ్వడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనీస ఫించన్‌పై చర్చించకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్రం నియమించిన భగత్ సింగ్ కమిటి కనీస ఫించన్ పెంచాలని సిఫారసు చేసినా మోడి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 6,7,8 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కనీస ఫించన్ అమలు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపడతామని, రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా నాగరాజు

ప్రజాశక్తి - కొత్తవలస

జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా చెరుకూరు నాగరాజు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తవలస కె.వి. కన్వెన్షన్ హాలులో విజయనగరం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఏ ఒక్కరికి కష్టం వచ్చినా ఆర్యవైశ్య సంఘం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ అడ్వైజర్ అంబికా కృష్ణ, ఎమ్మెల్సీ దూండి రాకేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తవ్వా మోహన్ రావు, విజయనగరం జిల్లా సెక్రెటరీ డ్రీమ్స్ రాజు, విజయనగరం జిల్లా ట్రెజరర్ బండారు మోహన్‌రావు, ఉప్పల ఈశ్వరరావు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం ప్రధాన కూడలిలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ రవాణాను అరికట్టాలన్న లక్ష్యంతో ఎస్పి ఆదేశాలను సారం వాహనాలను తనిఖీ చేస్తున్నామని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక తహశీల్దార్‌గా డి.సన్యాసినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ డిప్యూటీ తహధశీల్దార్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు.


రెడ్డి సత్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బేబినాయన, తదితరులు

## వైద్యులు సత్యారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - బొబ్బిలి

అనారోగ్యంతో మరణించిన సీనియర్ వైద్యులు రెడ్డి సత్యారావుకు ఎమ్మెల్యే బేబినాయన, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఆదివారం వేర్వేరుగా నివాళులర్పించారు. ఓంకార్ థియేటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే రెడ్డి సత్యారావు మరణం ప్రజలకు తీరని నష్టమన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రమ్ సీడర్ వరి సాగుతో రైతుకు లాభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్రమ్ సీడర్ వరి యద సాగుతో రైతుకి లాభమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు అన్నారు. ఆదివారం సతివాడలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్ వరి యద పద్దతిలో నాటడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం, దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ, తమ్మాపురం సర్పంచ్ పప్పల భాస్కర రావు, రైతులు పాల్గొన్నారు.

## నేడు పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వివిధ రకాలుగా 6ఎ కేసుల్లో మండల పరిధిలో పట్టుబడిన 17.23 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సోమవారం సాయంత్రం 4గంటలకు వేలం వేస్తామని ఉపతాహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు 2000 రూపాయలు ధారావత్తు చెల్లించి పాల్గొనాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**భోగాపురం** : మండలంలోని అమనాం వంతెన సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. దీనిపై సీఐ రవికుమార్ అందించిన వివరాలు ప్రకారం.. పూసపాటిరేగ రేగ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన తిరుమల లక్ష్మి (55) ఆమె కుమారుడు ప్రసాద్ విశాఖపట్నం పని మీద వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇంతలో మహారాజుపేట వంతెన పై ముందు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో లక్ష్మి కిందపడిపోయి బలమైన గాయాలయ్యాయి. వెంటనే తగరపువలసలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# బడి బయట.. లోపల.. రెండు చోట్లా కష్టాలే..!

వాగులో నుంచి నడిచి వస్తున్న విద్యార్థులు

**ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు 50 రోజులు కావస్తున్నా గత సమస్యలే విద్యార్థులను వెంటాడుతున్నాయి. బడి బయట, బడిలోపల కూడా సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా బంగారయ్యపేట, చిట్టివానిపాలెం గ్రామాల మధ్య కొండలను ఆనుకుని ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. ఈ పాఠశాలలో గదులకు, కిటికీలకు తలుపులు లేవు. భవనం పైకప్పు పెచ్చులూడి పోయాయి. గచ్చు నీటి చెమ్మతో పదునెక్కిపోతోంది. ఈ గచ్చుపైనే నేల మీద కూర్చుని చదవాల్సిన పరిస్థితి. కిటికీలకు తలుపులు లేకపోవడం వల్ల పాములు వచ్చేస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇవన్నీ ఒకెత్తు అయితే ఈ బడికి రావడానికి రహదారి లేక సుమారు రెండు కిలోమీటర్లు పొలం గట్లు, కొండవాగుల గుండా నడిచి రావాల్సిన దుస్థితి ఏర్పడిందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.**

- పెచ్చులూడిన భవనం.. నీటి చెమ్మతో గచ్చులు
- కిటికీలకు, గదులకు తలుపులే లేవు..
- బడికి వెళ్లాలన్నా పొలం గట్లే దిక్కు
- ఇదీ బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాల పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- వర్షాకాలంలో మరిన్ని అవస్థలు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొండ గంగుబూడి గ్రామ సచివాలయ పరిధిలోగల బంగారయ్య పేట, చిట్టి వానిపాలెం గ్రామాలకు మధ్యలో 1996లో ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. సుమారు 28 ఏళ్లు కావస్తుండటంతో భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పూర్తిగా పెచ్చులూడిపోవడం, తలుపులు లేకపోవడంతో కొండ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాలలోకి నిత్యం పాములు వచ్చేస్తున్నాయి.

**నీటి చెమ్మతో గచ్చులు**

కొండ నుంచి వచ్చే వర్షపు నీరు ఊటకు గచ్చులు నానిపోయి నీటి చెమ్మ వచ్చేస్తుంది. ఈ తడి గచ్చులపైనే విద్యార్థులు కూర్చుంటున్నారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంపు ధోరణి కారణంగా ఈ పాఠశాలకు నాడు నేడు నిధులు మంజూరు కాలేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ సుమారు 16 మంది విద్యార్థులు చదువుతుండగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా ఈ శిథిల భవనంలో చదివేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు పడుతున్నామని భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియదని ఉపాధ్యాయులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక గదిలో ఊడిపోయిన గచ్చు

**పొలం గట్లే దిక్కు**

ఈ పాఠశాలలోనే కాదు బడికి వెళ్లడానికి కూడా పిల్లలకు సౌకర్యం లేదు. చిట్టివాని పాలెం నుంచి కిలోమీటరు, బంగారయ్యపేట నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాఠశాలకు పిల్లలు వెళ్లేందుకు రోడ్డు లేదు. దీంతో సుమారు 2కిలోమీటర్ల దూరం ప్రతి రోజూ వాగులలో, పొలం గట్లపై నడిచి వెళ్లాల్సి వస్తుంది. అందరూ 10 ఏళ్ల లోపు పిల్లలే కావడం, గట్లపై, కొండ వాగుల్లో బురదల్లో నడిచి వెళ్లడం ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తలుపులు లేని ప్రధాన ద్వారం, కిటికీలు

**బడిలోనూ బితుకు బితుకే**

ఇంత ఇబ్బంది పడి వర్షాకాలం సైతం వాగుల్లో నడుచుకుంటూ వెళ్లి చదువుదామన్నా బడిలో కూడా ప్రశాంత వాతావరణం లేదు. తలుపులు, కిటికీలు లేకపోవడం వల్ల కొండను ఆనుకుని ఉన్న బడిలోకి ఏ మూల నుంచి ఏ పాము వస్తుందోనన్న భయంతోనే బితుకు బితుకు మంటూ చదువుతున్నారు. ఈ పిల్లలకు వండే వంటగది కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. తాగునీటి బావి పూర్తిగా పాడైపోయింది. అక్కడ మరుగుకూ ఇబ్బంది పడాల్సి వస్తుంది. మరుగుదొడ్లలో పాములు ఉండటంతో విద్యార్థులు భయంతో వెళ్లడం లేదు. ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వాలు చెప్పడం తప్ప ఆచరణ లేదని, ఇంత మంది పిల్లలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని, గిరిజనులంటే ఇంత అలుసా అని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

**నాడు నేడు నిధులు మంజూరు చేయలేదు**

బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి నాడు నేడు కింద నిధులు మంజూరు చేయలేదు. పాఠశాల శిథిలావస్థకు చేరడం వాస్తవమే. పిల్లలు పాఠశాలకు వెళ్లి రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్న మాట కూడా వాస్తవమే. ఈ విషయం ఉన్నత అధికారులకు తెలియజేస్తాను

**పి. బాలభాస్కరరావు, ఎంఇఒ, వేపాడ.**

**పొలం గట్ల తప్ప వేరే మార్గం లేదు**

మా పిల్లలు ఇద్దరు ఆ పాఠశాలలోనే చదువుతున్నారు. వీరు పాఠశాలకు వెళ్లడానికి పొలం గట్ల తప్ప వేరే మార్గం లేదు. సుమారు రెండు కిలోమీటర్ల నడిచి వెళ్ళాల్సి వస్తుంది. వర్షాకాలం మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. వేరే గత్యంతరం లేక ఈ పాఠశాలకు పంపిస్తున్నాం.

**గూనపాటి ఈశ్వరమ్మ, బంగారయ్యపేట.**

**నిత్యం పాములు కనిపిస్తాయి**

నేను ఈ పాఠశాలలో వంట ఆయాగా పనిచేస్తున్నాను. వంట గది కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నిత్యం వంట గదిలో పాములు కనిపిస్తుంటాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనతోనే వంట చేయాల్సి వస్తుంది. పిల్లలు కూడా ఈ వాగులు, పొలం గట్ల మీద వచ్చేటప్పుడు ఎన్నో సార్లు పాములను చూసి భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు మార్గం ఉంటే బాగుంటుంది.

**ఎం.ముత్యాలమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు**

# పనిచేశాం.. వేతనాలివ్వండి..?

- తొమ్మిది వారాలుగా ఉపాధి కూలీలు ఎదురుచూపులు
- మండలంలో రూ.3.21కోట్లు బకాయి
- ఆందోళనలో వేతనదారులు

ప్రజాశక్తి - జామి

కష్టపడి పనిచేసినా ఉపాధి కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. గత రెండు నెలల నుంచి ఉపాధి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు కారణంగా చేసేందుకు పని లేకపోవడం, గత 9 వారాలుగా చేసిన పనికి డబ్బులు రాక నరకయాతన పడుతున్నారు. మండలంలో వేతన జీవులకు రూ.3 కోట్లపైనే ప్రభుత్వం బకాయిలు పేరుకుపోవడమే అందుకు నిదర్శనం. ఒక్క జామి మండలమే కాదు, జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు ఉపాధి కూలీలకు విడుదల కావాల్సి ఉండడంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఎస్.కోట నియోజకవర్గంలో 12 పంచాయతీలు, గజపతినగరం నియోజకవర్గంలో 13 పంచాయతీలతో 25 పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 13వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 10,120 యాక్టివ్ జాబ్ కార్డులు ద్వారా 13,948 మంది పనులు చేస్తున్నారు. గత ఏడాది మండలంలో 7,12,578 పని దినాలు నమోదు చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకూ 4,27,440 పని దినాలు నమోదు చేశారు. అయితే ప్రభుత్వం నుంచి గత మే నెల 20 తేదీ వరకూ వేతనాలు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఈ రెండు నెలల్లో మండలంలో కూలీలకు ప్రభుత్వం నుంచి రూ. 3.21కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. కొన్ని పంచాయతీల్లో 5 వారాలు వేతన బకాయిలు పెండింగ్ కాగా, కొన్ని పంచాయతీల్లో 10 వారాలు దాకా కూలీ బకాయిలు ఉన్నాయని వేతన జీవులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణం ద్వారా విడుదల చేయాల్సిన బకాయిలు అధిక సంఖ్యలో ఉన్నట్లు గృహ నిర్మాణ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా ఉపాధి కూలీలు కష్టాలు తీరడం లేదని కూలీలు రోదిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూలీల బకాయిలు విడుదల చేసేలా, ఎమ్మెల్యేలు, మంత్రులు కృషి చేయాలని కోరుతున్నారు.

పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

**వారం, పది రోజుల్లో విడుదల**

ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన ఉపాధి వేతన బకాయిలు వారం, పది రోజుల్లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. కూలీలకు తమ బ్యాంకు ఖాతాలకు త్వరలోనే డబ్బులు పడతాయి. ఆందోళన చెందాల్సిన పని లేదు.

**- కిరణ్మయి, ఎపిఒ డ్వామా, జామి**

**వేతనాలు రాక ఇబ్బందులు**

ఐదారు వారాలు ఉపాధి పనులు చేసినప్పటికీ వేతనాలు ప్రభుత్వం విడుదల చేయలేదు. పనులు చేసి వారాలు గడుస్తున్నాయి. ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే కూలీ వేతనాలు విడుదల చేయాలి.

**- వంతల మల్లన్న, జామి.**

**ఆరు వారాల పని డబ్బులు రావాలి**

ఉపాధి పనులు చేసినా, పొట్ట నిండడం లేదు. పనులు చేసినా ఫలితం ఉండడం లేదు. ఆరు వారాల నుంచి వేతన డబ్బులు రాలేదు ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి బకాయిలు చెల్లించాలి.

**- కొర్రా రాములమ్మ, మాధవరాయమెట్ట, జామి**

## ఎంఇఒల ప్రకటన సబబు కాదు

**బాడంగి:** విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు తానిచ్చిన వినతిలో వాస్తవాలు లేవని ఎంఇఒలు లక్ష్మణ్, రాజేశ్వరి విలేకర్ల సమావేశంలో చెప్పడం సబబు కాదని గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం తన నివాసంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. తాను మంత్రికి ఇచ్చిన వినతి పత్రాన్ని విద్యాశాఖాధికారులు చూడకుండా ఆఫీసులో కూర్చొని ప్రెస్‌మీట్‌లు పెట్ట ఏది పడితే అది చెబితే చెల్లదన్నారు. నిజానికి గత ప్రభుత్వం జీవో నెంబరు 117 ప్రకారం కిలోమీటరు లోపు దూరం ఉన్న పాఠశాలల్లోని 3,4,5 తరగతులను యూపి స్కూల్లో మెర్జి చేసే కార్యక్రమాన్ని చేపట్టారని, ఆ క్రమంలో ఎరుకులపాకలు ప్రాథమిక పాఠశాల నుంచి గజరాయుని వలస యూపి స్కూల్‌కు సుమారు 1.6కిలోమీటర్లు ఉంటుందని అలాంటప్పుడు ఎరుకల పాకల విద్యార్థులను గజరాయునివలస స్కూల్‌నకు ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. ఇది గిరిజన విద్యార్థులపైన ఎరుకులపాకల గ్రామం పైన మండల విద్యాశాఖాధికారుల కక్ష సాదింపు చర్య కాదా అని ప్రశ్నించారు. కనీసం ఇప్పుడున్న అధికారులైనా సరే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాల్సింది పోయి వాళ్లకు నచ్చిన విధంగా పత్రికా ప్రకటన ఇవ్వడం మంచి పరిణామం కాదన్నారు. తమ గ్రామ స్కూల్ సమస్య తీర్చకపోగా తనపై తప్పుడు ఆరోపణ చేసినందున సంబంధిత అధికారులపై పరువు నష్టం దావా వేస్తానని, సంబంధిత అధికారులపై చర్య తీసుకుని తమ గ్రామ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రెండు గ్రూపుల విభేదాలతో రహదారిపైకి మురుగునీరు

- అదే మురుగునీరు పై నుంచి గ్రామస్తులు, వాహనదారుల రాకపోకలు
- నేటికీ పరిష్కారం చూపని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- భోగాపురం

గ్రామంలో రెండు గ్రూపుల మధ్య కాలువ సమస్య కారణంగా ఏర్పడిన విభేదాలతో మురుగునీరు ఏకంగా రహదారిపైకి వదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను జిల్లా కలెక్టరుతో సహా ఎవరు పరిష్కరించలేక పోవడం విశేషం. దీంతో ఈ మురుగు నీటిలో నుంచి గ్రామస్తులతో పాటు భోగాపురం గ్రామం నుంచి ముక్కాం వెళ్లే వాహనదారులు కూడా వెళ్ళాల్సిన దుస్థతి ఏర్పడిందని పలువురు అంటున్నారు.

మండలంలోని ముంజేరు గ్రామంలో సిద్దార్థ కాలనీ వాసులకు, గ్రామస్తులకు మద్యం కాలువ వివాదం గత కొన్ని నెలలు నుంచి సాగుతోంది. గ్రామస్తులు వాడుతున్న మురుగు నీరు సిద్దార్థ కాలనీ మీదుగా గెడ్డలోకి పంపించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నిధులు కూడా మంజూరు చేశారు. అయితే దీనికి కాలనీ వాసులు అంగీకరించలేదు. ఆ మురుగు నీటిని తమ కాలనీ మీద నుంచి పంపితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఏదైతా పాత కాలువ ఉండేదో దాని నుంచి కాని, ముక్కాం వెళ్ళే రహదారి పక్క నుంచైనా మురుగునీటి కాలువ నిర్మించి విడిచి పెట్టాలని చెబుతున్నారు. చివరకు గత కలెక్టరు వద్దకు కూడా ఈ సమస్య వెళ్ళినప్పటికి పరిష్కరించలేకపోయారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

**వ్యాధులు వస్తే బాధ్యత వహించేది ఎవరు.?**

కాలువలో నుంచి వస్తున్న మురుగునీటిని బస్‌స్టాప్ వద్ద ఆపి రహదారిపైకి మళ్ళించారు. ఒక వేళ కాలువలో నుంచి నేరుగా వెళితే ఇదే బస్‌స్టాప్ వెనుక భాగంలో ఎటు వెళ్ళక ఒకేచోట నిల్వ ఉండిపోతుంది. రహదారిపైకి వదిలేయడంతో అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మురుగు నీటిని ఇలా రోడ్డు మీదకు వదిలేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి పై నుంచే అనేక వాహనాలు వెళ్తుంటాయి. గ్రామస్తులు కూడా ఈ మురుగునీటి పైనుంచే రాకపోకలు చేస్తున్నారు. ఒక వేళ డెంగీ, విషజ్వరాలు, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# విధ్వంసక చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కూటమి ప్రభుత్వం విధ్వంసక చర్యలు మానుకోవాలని వైసిపి రీజనల్ డిప్యూటి కో ఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. దన్నానపేటలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ పతివాడ వెంకునాయుడు ఇంటి ప్రహరీని కూల్చి వేసిన నేపథ్యంలో ఆదివారం ఆయన సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విధ్వంసక చర్యలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా జిల్లాలో కూటమి ప్రభుత్వం ఏర్పడి కక్ష సాధింపు చర్యలతో వైసిపి సానుభూతి పరుల ఇళ్లను కూల్చివేసి రాక్షసానందం పొందడం సమంజసం కాదన్నారు. పోలీస్, రెవెన్యూ యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలు మానుకోవాలని హితవు పలికారు. జిల్లాలో ఇలాంటి కక్ష పూరిత వాతావరణం ఎన్నడూ చూడలేదని తెలిపారు. కాగా వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని, అధికారం, ప్రతిపక్షం తమ పార్టీకి కొత్త కాదని చెప్పారు. ఆర్మీ జవాన్ దేశ రక్షణకు 24ఏళ్లు సేవ చేస్తే కూటమి ప్రభుత్వం కూల్చివేత బహుమతి ఇచ్చిందని ఎద్దేవా చేశారు. దన్నానపేటలో కూడా ఎన్నో అక్రమాలు ఉన్నాయని అవి అధికారులకు కనబడ లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం విధ్వంసక పాలనపై ప్రజల్లోకి తీసుకు వెళ్ళి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, కె.వి.సూర్య నారాయణ రాజు, మండల పార్టీ అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, నగర పంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబ శివ రావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఎస్సీ సెల్ నాయకులు రేగాన శ్రీని వాస రావు, సతివాడ ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, సర్పంచ్ గేదెల చిరంజీవి మాస్టర్, నాయకులు తర్లాడ దుర్గారావు, మహంతి రామారావు, పతివడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

**IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM**
**IA 112/2019 O.S. 89/2009**

Between :
Suryadevara Varalakshmi....Petitioner/Plaintiff
And :
Areti Adilakshmi and 15 others ..Respondents/Defendant

**NOTICE**

**R5.** Pathivada Ramu Naidu, S/o Late Appadu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R6.** Pathivada Pydiraju, S/o Ramunaidu, R/o R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R7.** Pathivada Sankara Rao, S/o Ramunaidu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R8.** Pathivada Appala Raju, S/o Ramunaidu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R9.** Pathivada Pydichetty, W/o Late Narayanappadu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R10.** Pathivada Venkata Rao, S/o Late Narayanappadu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R11.** Pathivada Bangaru Raju, S/o Late Narayanappadu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R15.** Pathivada Suryanarayana, S/o Late Appadu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.
**R16.** Pathivada China Ramana, S/o Late Bangaru Naidu, R/o Polipalli (V), Bhogapuram (M), Vizianagaram Dist.

పై నెంబరు దావాను వాది దాఖలు చేసుకున్నారు. మీకు నోటీసు అందజేసేందుకు ప్రత్యామ్నాయంగా పేపరు పబ్లికేషన్ ద్వారా <u>తే 5-8-2024ది ఉదయం 10-30 గంII</u>లకు వాయిదా అయిఉన్నది. కావున మీరుగాని, మీ తరపు లాయరు ద్వారా గాని కోర్టుకి హాజరై మీకున్న ఆక్షేపణలను తెలియజేయవలెను. లేనిచో మీపై పరోక్షంగా వున్న ఆధారాల మేరకు తీర్మానం జరుగుతుందని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**P.Dhananjaya Rao,**
Advocate for Petitioner,
Cell: 9440711430

**In the Honourable Court of the Senior Civil Judge at Vizianagaram**
**IP 7/2024**

Between :
Badragiri Sai Prasad, S/o Umamaheswara rao, aged about 45 years, Hindu, Resident of 9-7-20A, East Baliji Street, Opp. Ganesh Temple, Vizianagaram ......Petitioner
And :
Gorle Ramana and 11 others ...Respondents

**NOTICE TO RESPONDENTS**

1. Gorle Ramana, S/o Apparao, R/o Door No.3-52, Chinnaveedhi, Gantyada Village and Mandal, Vizianagaram Dist.
2. Badragiri Satyasudha, W/o Yerra Jogarao, R/o of 9-7-20A, East Baliji Street, Opp to Ganesh Temple, Vizianagaram
3. Jarajapu Lokesh Kumar, S/o Vinodh Kumar, R/o Plot No.202, MIG-C-35, S.L.Sai Paradise, Ramalayam Temple, Sheelanagar, Visakhapatnam.
4. V.Satyanarayana, S/o Seetharama Swamy, R/o Ward No.7, House No. 114/98/1, Near Mandir Tala, Sree Krishnapur, Khargapur, West Midnapore, West Bengal.
5. Taddi Ramana, S/o Suryanarayana, R/o Door No. 1-242, Madyastreet, Vompilli, Bondapalli Mandal, Vizianagaram Dist.
6. Chodavarapu Raju @ Appalaraju , S/o Sanyasi Rao, resident of Baliveedhi, Vompilli, Bondapalli Mandal, Vizianagaram Dist.
7. Chodavarapu Prakash, S/o Sanyasi Rao, R/o Bali Veedhi, Vampilli village, Bondapalli Mandal, Vizianagaram Dist.
8. Sunkari Venkata Ramana, S/o Krishna, R/o Bhopalapuram, Nadupuru, Gurla Mandal, Vizianagaram Dist.
9. Golajana Ravindra, S/o Appalanaidu, R/o Parasam, Nellimarla Mandal, Vizianagaram Dist.
10. Matta Venkata Lakshmi W/o Bora Seshavataram, R/o Door No.10-5/3-6, Hukumpeta, Near Ramamandiram, Vizianagaram.
11. Yerra Joga Rao, C/o Umamaheswara Rao, R/o 9-7-20A, East Baliji Street, Opp. Ganesh Temple, Vizianagaram.
12. Paturu Satish Kumar, S/o Papayachari, R/o Putchalaveedhi, Near Devangula Sangam, Vizianagaram.

పై నెంబరు ఐ.పి 7/2024లో పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్లు వద్ద నుండి ఋణములు తీసుకొని దరిమిలా దివాలా తీసినందున అందుకు పిటిషనర్ ఇన్‌సాల్వెంట్ పర్సన్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పై వ్యాజ్యము దాఖలు చేయగా సదరు వ్యాజ్యము తే 02-08-2024దీన వాయిదా వేసినారు. కావున అందుకు ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టులో <u>తే02-08-2024దీన ఉదయం గంII 10-30గంII</u>లకు హాజరు అయి వారి ఆక్షేపణలు ఇందుమూలంగా తెలియపరుచుకొనవలసినదిగా చేయడమైనది.

<u>బై కోర్టు ఆర్డర్</u>

**LENKA SRINIVAS**
Advocate, Vizianagaram,
Cell: 8328483449